క్లుప్తంగా

సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో ర్యాలీ

ఆదిలాబాద్‌రూరల్: రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును పురస్కరించుకొని సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక బుద్ధవిహార్ నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కుమురం భీం, తెలంగాణ తల్లి, వినాయక్ చౌక్, అశోక్ రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ సాగింది. జై భీం, అంబేద్కర్ అంటూ నినాదాలతో విన్యాసాలు చేశారు. హక్కులు, చట్టాలను పరిరక్షించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సమత సైనిక్ దళ్ ప్రతినిధులు అన్నారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించేలా గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న శ్రామ్నెర్ శిబిరం శుక్రవారంతో ముగిసిందన్నారు. కార్యక్రమంలో కేంద్రీయ సంఘటకులు సునీల్ సారిపుత్త, దక్షిణ భారత సంఘటకులు మార్షల్ దీప్ వాఘ్మారే, తెలంగాణ సంఘటకులు రవీంద్రచంద్ర జాబడే, మార్షల్ విశ్వభూషన్ వాఘ్మారే, ధనశ్రీ, అమ్రపాలి వాఘ్మారే, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేత

నార్నూర్: మండలంలోని ఝండా బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని త్రిషకు శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా మెడల్, ప్రశంసా పత్రాన్ని జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్, ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గూడల్లో పుట్టి ఇటీవల ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో రెండో స్థానాన్ని కైవసం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పీడీ ఆడే విశ్వనాథ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం'


మాట్లాడుతున్న నాయకులు

ఎదులాపురం: బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని, ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ర్యాలీ ప్రారంభించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జగన్‌సింగ్‌లు మాట్లాడారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక దేవిదాస్, ఏఐటీయూసీ నాయకులు కుంటల రాములు, ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకట్ నారాయణ, టీఆర్ఎస్‌కేవీ నాయకులు అశోక్, నగేశ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.


నేరడిగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


బేల: జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో మహేందర్ కుమార్


తాంసి: భీంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో..

మురిసిన మువ్వన్నెల జెండా

జిల్లా వ్యాప్తంగా 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో అధికారులు, నాయకులు జాతీయ జెండా ఎగురవేశారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధాన రహదారుల వెంట ర్యాలీ నిర్వహించి, భారత్ మాతకు జై, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అధికారులు ప్రశంసా పత్రాలు అందజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


నేరడిగొండ: జాతీయ గీతం ఆలపిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది


సిరికొండ: చిన్నారుల వేషధారణ


ఆదిలాబాద్‌రూరల్: ఎంపీపీ కార్యాలయంలో..


గుడిహత్నూర్: జెండా ఆవిష్కరిస్తున్న డీటీ భాగ్యలక్ష్మి


బజార్‌హత్నూర్: జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్


నార్నూర్: జెండా ఆవిష్కరిస్తున్న సర్పంచ్ గజానంద్ నాయక్, నాయకులు


జైనథ్: జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ శ్యాంసుందర్, సిబ్బంది


తలమడుగు: జాతీయ జెండా ఎగరవేస్తున్న ఎంపీడీవో రమాకాంత్


కైలాస్‌నగర్: అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న చైర్మన్, కమిషనర్


ఇంద్రవెల్లి: జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సోము


ఉట్నూర్‌రూరల్: ఆర్డీవో కార్యాలయంలో వేడుకలు


ఇచ్చోడ: జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ తుకారాం


తాంసి: తహసీల్దార్ కార్యాలయంలో..

28న టాలెంట్ టెస్ట్

ఎదులాపురం: తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పూసం సచిన్, ఆత్రం తనుష్ ఒక ప్రకటనలో తెలిపారు. మావల మండల పరిధి నలంద జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు టాలెంట్ టెస్ట్ ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి దుర్గాప్రసాద్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రంలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనడానికి ఖర్చుల కోసం విద్యార్థికి పాఠశాల హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి, పీఈటీ స్వామి రూ.4వేల ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ గణిత ఫోరం (టీఎంఎఫ్) ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను శుక్రవారం డీఈవో కార్యాలయంలో డీఈవో ప్రణీత ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిలీప్ రెడ్డి, కిషన్, సుదర్శన్, బండి సుభాష్, అవుల మహేంద్ర, సత్యనారాయణ, మురళీధర్, రాంచంద్రా రెడ్డి, గంగయ్య, వినేష్, శశికళ, గోకుల్ పాల్గొన్నారు.

పరామర్శ

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్‌ను పరామర్శించారు. మల్లేష్ తండ్రి సత్తు నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న కంది కరీంనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి మల్లేష్‌తో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట అమ్మన్యూస్ సీఈవో కంది రామచంద్రారెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బ్యాండ్ సామగ్రి అందజేత

బేల: మండలంలోని చప్రాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అడనేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.7వేల విలువ గల బ్యాండ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫౌండేషన్ చైర్మన్ సతీష్‌పవార్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మెస్రం దౌలత్ రావు, శాత్రే గంభీర్, యాసం సతీష్, నకాతే శాలిక్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివాదానికి దారి తీసిన జైశ్రీరాం నినాదం

- జెడ్పీ పాఠశాలలో స్వల్ప ఉద్రిక్తత
- పోలీసులు రంగ ప్రవేశంతో సద్దుమనిగిన వివాదం

ఇచ్చోడ: మండల కేంద్రంలో గణతంత్ర వేడుకల సందర్భంగా శుక్రవారం ప్రభాత భేరిలో కొంత మంది విద్యార్థులు చేసిన నినాదాలు వివాదానికి దారి తీశాయి. విద్యార్థులు జైశ్రీరాం అంటూ.. నినాదాలు చేశారని, మరో వర్గానికి చెందిన యువకులు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోకి చొచ్చుకు వచ్చారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరేశ్ ఘటన స్థలానికి చేరుకొని వారిని బయటకు పంపించారు. ఇదే విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. భారీ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఇచ్చోడను సందర్శించిన ఎస్పీ..

మండల కేంద్రంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉద్రిక్తత నెలకొనడంతో ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం మధ్యాహ్నం ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసు అధికారులతో మాట్లాడారు. అనంతరం జెడ్పీ పాఠశాల ఆవరణను పరిశీలించి అక్కడి నుంచి జామ మసీద్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి కాలినడకన సాయిబాబా ఆలయం వరకు వెళ్లి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉట్టిపడిన దేశభక్తి

- అలరించిన చిన్నారుల నృత్యం
- ఆకట్టుకున్న ప్రభుత్వశాఖల స్టాళ్లు, శకటాలు

ఎదులాపురం: 75వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, భిన్నత్వంలో ఏకత్వం తెలుపుతూ దేశభక్తి గీతాలపై సుమారు 200 వందల మందితో నిర్వహించిన నృత్యం ఆకట్టుకుంది. ప్రభుత్వ పాఠశాల తిర్పెల్లి, లిటిల్ స్టార్ విద్యార్థులు దేశ సమగ్రత, సంస్కృతి, విలువలు, భిన్న సంస్కృతుల్లోనూ ఏకత్వంను తెలుపుతూ ప్రదర్శన నిర్వహించారు. మహాత్మా జ్యోతిబాఫూలే జైనథ్ విద్యార్థులు చదువు గొప్పతనం వివరించారు. తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బాలికలు చేసిన నృత్యం అలరించింది.


జిల్లా ఎలక్షన్ కమిషన్ శకటం

ప్రభుత్వ శాఖల శకటాలు..

ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూడిన శకటాలు, స్టాళ్లను ప్రదర్శించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మహాలక్ష్మి పథకం గురించి తెలుపుతూ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు రైతు భరోసా, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇళ్ల గురించి వివరిస్తూ, ఎలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో ఓటు విలువను తెలుపుతూ, జిల్లా వైద్యారోగ్య శాఖలు శకటాలను ప్రదర్శించారు.


లిటిల్ స్టార్ విద్యార్థుల నృత్య ప్రదర్శన

స్టాళ్ల ప్రదర్శన..

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి స్టాళ్లను ఏర్పాటు చేశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల ఆయా ప్రభుత్వ కార్యక్రమాల ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఛాయా చిత్రాలను ఆయన సంబంధిత శాఖ అధికారులతో కలిసి తిలకించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి పథకాలు, నేచురల్ ఆయిల్స్, డ్రైఫ్రూట్స్‌తో చేసిన లడ్డులు, రాగితో చేసిన బిస్కెట్‌లతో స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ డివిజనల్ కార్యాలయం ఉట్నూర్ ఆధ్వర్యంలో గిరిజన అటవీ ఉత్పత్తులు, సహజ ఉత్పత్తులను ప్రదర్శించారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

నార్నూర్: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఖండేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలిసారిగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేను తొడసం వంశస్తులు ఘనంగా సన్మానించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భేటీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. దేవుని సన్నిధిలో ఆదివాసీ మహిళ 2.50 కిలోల నూనె తాగిందంటే దేవుడి మహిమ అని చెప్పేందుకు ఇది నిదర్శనమన్నారు. గ్రామాల్లోని పిల్లలను బడికి పంపించాలన్నారు. చాలా గ్రామాల్లో యువత క్రికెట్ టోర్నమెంట్ అంటూ సమయాన్ని వృథా చేస్తున్నారని, గ్రామపటేళ్లు పరీక్షల సమయంలో ఎలాంటి టోర్నమెంట్లు నిర్వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను ఎప్పటికీ మర్చిపోవద్దు సూచించారు. ఆలయ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. రాయిసెంటర్ సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, నాగోబా ఆలయ కమిటీ సభ్యుడు మెస్రం శేఖర్, కటోదాలు తొడసం బాపురావు, తెలంగరావు, రాజు, గోపాల్, లోఖండే దేవురావు పాల్గొన్నారు.


తొడసం వంశస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

- నాణ్యత లేని సరుకులు, కూల్‌డ్రింక్స్
- అమాయక ప్రజలకు అంటగడుతున్న వ్యాపారులు
- తనిఖీలు చేపట్టని అధికారులు

సిరికొండ: ప్రస్తుత బిజీ ప్రపంచంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. దీంతో వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇలా జరుగుతున్న పరిణామాల దృష్ట్యా వైద్యులు సమయానికి భోజనం చేయాలని, ప్రతీరోజు వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు. కానీ మనం సమయానికి తినుకుంటున్న ఆహారం మంచిదేనా అనే సందేహం తలెత్తుంది. మార్కెట్లో దొరుకుతున్న కల్తీ ఆహార పదార్థాలతో ప్రజలు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నట్లు అవుతుంది.

అమాయకులను ఆసరా చేసుకొని..

మండలంలో ఎక్కువగా గిరిజన ప్రజలే ఉంటారు. వారు వ్యవసాయం చేసుకుంటూ.. జీవిస్తుంటారు. అత్యధికంగా నిరక్షరాస్యులే. వీరికి అవసరం ఉన్న నిత్యావసర సరుకులను చిన్న కిరాణ దుకాణాల్లో, లేకపోతే మండల కేంద్రానికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. వ్యాపారులు వారికి తక్కువ నాణ్యత ఉన్న వస్తువులు, సరుకులు అంటగడుతున్నారు. అచ్చం కంపెనీ వస్తువులుగా చిన్న చిన్న మార్పులతో మార్కెట్లో విక్రిస్తున్నారు. వీటికి తోడు గడువు తీరిన వస్తువులు, కూల్‌డ్రింక్‌లు ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తూ.. వారిని నిండా ముంచుతున్నారు.


సంతలో విక్రయిస్తున్న కారం పొడి

చర్యలు తీసుకుంటాం

మార్కెట్లో నకిలీ వస్తువులు విక్రయించిన, కల్తీ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మార్కెట్లో వ్యాపారస్తులు అధిక ధరలకు నిత్యావసర సరుకులు విక్రయించవద్దు. నిత్యం తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

– విజయ్ కుమార్, తహసీల్దార్, సిరికొండ

సంతలో కల్తీలు అధికం..

మండలంలోని సంతల్లో ప్రజలకు నాణ్యత లేని నిత్యావసర సరుకులను ఎలాంటి భయం లేకుండా దర్జాగా విక్రయిస్తున్నారు. నకిలీ నూనేలు, కారం పొడి, మసాలాలు, అల్లం పేస్టు, కిరాణ సామగ్రి, తదితర సరుకులను ప్రజలకు అంటగడుతున్నారు. అధికారులు తనిఖీ చేయకపోవడంతో ఈ దందాకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

పార్టీ కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు

కైలాస్‌నగర్: 75వ గణతంత్ర వేడుకలు జిల్లా కేంద్రంలోని వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించి, జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం గౌరవ వందనం చేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతో పాటు పట్టణంలోని గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్‌ల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ సోయం బాపూరావు జెండా ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ కృషి వల్ల స్వేచ్ఛ వాయులను అనుభవిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాసేవ భవన్ వద్ద డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి త్రివర్ణ పతకాన్ని ఎగురవేశారు. బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, మాజీ ఎంపీ గోడం నగేశ్‌తో కలిసి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. అంతకు ముందు గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్‌లోని మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి, జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా పార్టీల నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, లాలామున్నా, బాలూరి గోవర్ధన్‌రెడ్డి, గుడిపెల్లి నగేశ్, యూనిస్ అక్బానీ, అజయ్, నర్సింగ్ రావు పాల్గొన్నారు.



గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ


గౌరవ వందనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


జాతీయ గీతం ఆలపిస్తున్న జోగు రామన్న

ట్రావెల్స్ యజమానికి సన్మానం

ఎదులాపురం: జీఎస్ఆర్ ట్రావెల్స్ యజమాని అందిస్తున్న సేవలను గుర్తిస్తూ జిల్లా రవాణాశాఖ అధికారులు శుక్రవారం ట్రావెల్ యజమాని ప్రమోద్‌కుమార్ ఖత్రిని సన్మానించారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరయ్యే విద్యార్థుల కోసం సదరు యజమాని ఫ్రీగా బస్సులు నడుపుతున్నారు. ఆయన ఉచిత సేవలను గుర్తిస్తూ కలెక్టర్ ఇటీవల అవార్డు సైతం అందజేశారు. ఇందులో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, భిక్షపతి, రామారావు, రవికుమార్, మహేశ్, సురేశ్, సూపరింటెండెంట్ శైవంత్ రాథోడ్, సంజయ్, సిబ్బంది పాల్గొన్నారు.


సన్మానిస్తున్న రవాణా శాఖ అధికారులు